క్లుప్తంగా

ఉచితంగా యూనిఫామ్స్


చందూర్‌లో యూనిఫామ్స్ అందిస్తున్న ఉపాధ్యాయులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న యూనిఫామ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం తారాసింగ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చందూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

మంత్రి వివేక్‌కు శుభాకాంక్షలు


మంత్రి వివేక్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మంత్రి వివేక్‌ను చిన్నశంకరంపేట, నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నశంకరంపేట మండల కాంగ్రెస్ నాయకులు జనార్ధన్, సాయిలు, నార్సింగి మండల కేంద్రానికి చెందిన మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య మంత్రిని కలిసి సన్మానించారు. మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియామకమైన వివేక్ జిల్లా అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.

వైద్య సిబ్బందికి యోగా శిక్షణ


యోగా శిక్షణలో పాల్గొన్న ఆసుపత్రి సిబ్బంది, నర్సులు

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్, వైద్య సిబ్బందికి శుక్రవారం ఆయుష్ శాఖ శిక్షకులు మద్దెల భరత్ యోగా ఆసనాల్లో శిక్షణ ఇచ్చారు. ఆగ్రహావేశాల నియంత్రణ, నిద్రలేమి, తదితర సమస్యలపై వేయాల్సిన ఆసనాల విషయమై అవగాహన కల్పించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతి ఒక్కరూ విధిగా యోగాసనాలు వేయాలని భరత్ సూచించారు. ఆసుపత్రి నర్సులు ఇతర సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ గురుకులంలో ఏడుగురికి అడ్మిషన్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ఎస్టీ బాలుర గురుకుల కళాశాలలో శుక్రవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించి ఏడుగురు విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ ఫణికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 2, బైపీసీలో 5 సీట్లు భర్తీ చేసినట్లు తెలిపారు. ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు ఉండగా.. ఇప్పటి వరకు ఎంపీసీలో 9, బైపీసీలో 18 సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. మిగతా సీట్ల భర్తీ కోసం మరోవిడత కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో ఎస్టీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు.

గర్భిణులకు యోగా శిక్షణ


తూప్రాన్ సీహెచ్‌సీలో గర్భిణులకు యోగా శిక్షణ ఇస్తున్న దృశ్యం

తూప్రాన్: అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని సీహెచ్‌సీలో గర్భిణిలకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అమర్‌సింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణులకు వివిధ రకాల ఆసనాలను శిక్షకురాలు శ్రీలత శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ గర్భిణీలు నిత్యం యోగా ద్వారా ఆసనాలను చేయడం ద్వారా పుట్టబోయే బిడ్డా ఆరోగ్యవంతంగా జన్మిస్తారని తెలిపారు. ప్రసవ సమయంలో ఇబ్బందులు కలుగకుండా ఉంటుందని సూచించారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు సీజ్

పటాన్‌చెరు: విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించినట్లు పటాన్‌చెరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయరావు తెలిపారు. శుక్రవారం బీరంగూడ సమీపంలో పలు విద్యాసంస్థల బస్సుల తనిఖీ చేపట్టి రెండు బస్సులను సీజ్ చేశామని, మరో రెండింటికి జరిమానా విధించినట్లు చెప్పారు.

దుకాణాలు ఎప్పుడు అప్పగిస్తారో?

- నిరుపయోగంగా దుకాణ సముదాయం
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆదాయానికి గండి


వృథాగా నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్ దుకాణాల సముదాయం

నర్సాపూర్: వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో దుకాణ సముదాయం నిర్మించి రెండున్నరేళ్లు కావొస్తున్నా, వాటిని అద్దెకు ఇవ్వడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. రూ. 81 లక్షలతో 2022లో వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పది షెటర్ల సముదాయం నిర్మించారు. పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు అద్దెకు ఇవ్వాలని సుమారు ఏడాది క్రితం స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించినట్లు తెలిసింది. నిబంధనల మేరకు అద్దెకు ఇస్తామని చెప్పారే తప్ప అవసరమైన చర్యలు తీసుకోవడంలో జాప్యం చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు అధికారులు టెండర్లు పిలవగా, పలువురు వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే వారికి దుకాణాలు కేటాయించినా, ఇప్పటివరకు అప్పగించలేదు. కరెంటు కనెక్షన్ లేనందున వాటిని అప్పగించడంలో జాప్యం జరుగుతుంది. దుకాణ సముదాయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం 2022లో మార్కెట్ కమిటీ అధికారులు దరఖాస్తు చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు అంచనాలు తయారు చేసినా, అందుకు అవసరమైన డబ్బును మార్కెట్ కమిటీ అధికారులు చెల్లించలేదని తెలిసింది. దీంతో ఇటీవల మార్కెట్ కమిటీ అధికారులు కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని కోరగా, 2022లో తయారు చేసిన ఎస్టిమేషన్ ప్రస్తుతం పనికి రాదని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా కొత్తగా తయారు చేయాల్సి ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు చెప్పినట్లు సమాచారం.

> **కరెంట్ కనెక్షన్ ఇవ్వగానే అప్పగిస్తాం**
>
> కరెంట్ కనెక్షన్ లేనందున దుకాణాలను వ్యాపారులకు అప్పగించలేదు. కొత్త ఎస్టిమేషన్ తయారు చేయగానే విద్యుత్‌శాఖకు అవసరమైన డబ్బు చెల్లిస్తాం. కరెంట్ కనెక్షన్ ఇవ్వగానే దుకాణాలను వ్యాపారులకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటాం.
>
> – ప్రతాప్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి



ఇళ్ల మంజూరు పత్రాల అందజేత


కొల్చారం మండలం రంగంపేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

శివ్వంపేట(నర్సాపూర్): అర్హులకు సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందని కాంగ్రెస్ నాయకులు మాధవరెడ్డి, నవీన్‌గుప్తా, శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన శివ్వంపేటతో పాటు గోమారం, దొంతి పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, ప్రభులింగంగౌడ్, గణేష్, తిరుపతి రాథోడ్, మల్లేష్, తదితరులు ఉన్నారు.

రంగంపేటలో..

కొల్చారం(నర్సాపూర్): ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంపికైన లబ్ధిదారులకు శుక్రవారం మంజూరు పత్రాలను అందజేశారు. రంగంపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ గౌడ్, చందు, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే.. పైతరలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అనిల్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొనగా, ఏటిగడ్డ మాందాపూర్‌లో జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేట, కంచన్‌పల్లి, కూకుట్లపల్లి తదితర గ్రామాలలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా వెంకట్రావ్‌పేటలో నాయకులు, లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్‌పాషా, వీరేష్‌గౌడ్, లావణ్య, రామానుజం, రాజు, కిరణ్‌గౌడ్, పర్వతాలు, ఎక్బాల్, భాగయ్య, పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఆర్డీఓ

రామాయంపేట(మెదక్): మండలంలోని దామరచెరువులో పోలింగ్ స్టేషన్లను శుక్రవారం మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న 76, 77 నంబర్ల పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఆమె.. పలు సూచనలు చేశారు. అంతకు ముందు ఆమె గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. తహశీల్దార్ రజనీకుమారి ఉన్నారు.

సదస్సులతో భూ సమస్యలకు చెక్

నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి


కొట్టాలలో సదస్సును పరిశీలిస్తున్న ఆర్డీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కొట్టాలలో జరిగిన భూభారతి సదస్సును పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్న దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎక్కువగా సాదాబైనామా, సర్వేనంబర్ మిస్సింగ్, ప్రభుత్వ భూమికి పట్టా మార్పు చేయాలని దరఖాస్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కొట్టాలలో 63, వెల్మకన్నలో 67మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, ఆర్ఐ శ్రీహరి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భూముల సమస్యలను పరిష్కరిస్తాం

తహసీల్దార్ మన్నన్


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్ భిక్షపతిగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): గతంలో పార్ట్ బీలో చేర్చిన రైతుల భూముల సమస్యలను త్వరలోనే పరిష్కారం చూపుతామని తహసీల్దార్ మన్నన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని టీ.మాందాపూర్‌లో భూ భారతి గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..టీ.మాందాపూర్‌లో అటవీశాఖ అభ్యంతరంతో నిలిచిపోయిన భూ పట్టాపాస్ పుస్తకాలను అందించేందుకు జాయింట్ సర్వే నిర్వహిస్తామని తెలిపారు. అటవీ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ భిక్షపతిగౌడ్ రైతుల సమస్యలపై వినతి పత్రం అందించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

వెల్మకన్న గ్రామస్తుల డిమాండ్


భూమిని పరిశీలిస్తున్న జహీర్, గ్రామస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్న గ్రామశివారులోని సర్వేనంబర్ 447లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం వెల్మకన్నలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించగా.. మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపీపీ నవీన్‌గుప్తా ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ జహీర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ స్థలాన్ని డిప్యూటీ తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాజేందర్ మాట్లాడుతూ కౌడిపల్లికి చెందిన మోతీలాల్‌గౌడ్ 447 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని పలుమార్లు కుటుంబ సభ్యుల పేరిట అక్రమంగా పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడి వెల్మకన్న గ్రామంలో ఇండ్లులేని పేదలకు పట్టాలు, లేదా కౌడిపల్లిలో డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్డీఓ**

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కె వెంకటపూర్‌లో శుక్రవారం మెదక్ ఆర్డీఓ రమాదేవి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించే పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులు, వెలుతురు వంటి సదుపాయలను పరిశీలించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఇమ్మాద్ పాల్గొన్నారు.

◆ **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ**

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని సీతానగర్, బహిరన్‌దిబ్బ గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేషారెడ్డి మాట్లాడుతూ వెంటనే ఇళ్లు కట్టుకుంటే బిల్లులు మంజూరు అవుతాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కౌసిక్, పార్టీ నాయకులు సుభాశ్‌రావ్, చెన్నప్ప, ప్రభు, ప్రేమ్‌కుమార్, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **మాజీ ఎమ్మెల్యే పరామర్శ**

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు దుర్గాగౌడ్ తండ్రి బాలరాజుగౌడ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆమె వెంట లావణ్యరెడ్డి, ఆంజనేయులు, ఎలక్షన్‌రెడ్డి, నారాయణ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి రసాయనాలొద్దు

రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన


కొండాపూర్ అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మనోహరాబాద్(తూప్రాన్): మోతాదుకు మించి రసాయనాలు వాడొద్దని రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు విజ్ఞప్తి చేశారు. మండలంలోని కొండాపూర్‌లో శుక్రవారం రైతు ముంగిట శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ యూనివర్సిటీ సీనియర్ శాస్త్రవేత్త కే శ్రీనివాస్, శాస్త్రవేత్త వినయ్ మాట్లాడుతూ.. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పత్తి పంటలో విశిష్టమైన విధానాల గురించి తెలిపారు. వివిధ పంటలు, యూరియా వాడకం, పంటల మార్పిడి, చెట్ల నాటడం తదితర అంశాలపై క్లుప్తంగా వివరించారు. రైతులు తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు విజయలక్ష్మి, రఘునాథ్, ఏఈఓ సచిన్ పాల్గొన్నారు.

హైవేపై గుంతలతో ఇబ్బందులు


నర్సాపూర్ జాతీయ రహదారిపై ఏర్పడిన గుంత

నర్సాపూర్: నర్సాపూర్ మీదుగా ఉన్న రెండు జాతీయ రహదారులపై రెండు చోట్ల గుంతలు ఏర్పడటంతో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు సరిగా నిర్వహణ చేపట్టడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. స్థానిక చౌరస్తాలో రోడ్డు వెడల్పు మేరకు గుంతలు ఏర్పడగా.. గతంలో మున్సిపాలిటీ అధికారులు గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేయించినా ప్రయోజనం లేకుండా పోయింది. గుంతలలో సిమెంటు వేసి మరమ్మతులు చేయగా ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో పరిస్థితి యథావిధిగా మారింది. దీంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. వర్షం పడినప్పుడు పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటుంది. ఎక్కడ ఉందో తెలియక ప్రమాదానికి గురైన సందర్భాలు అనేకం ఉన్నాయి. స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో గుంత పడి చాలా నెలలు గడుస్తున్నా శాశ్వత మరమ్మతులు చేయకపోవడం గమనార్హం. మున్సిపాలిటీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయించి తమ పనై పోయిందనిపించారు. కాగా ఇటీవల గుంతలో వేసిన సిమెంటు కంకర కొట్టుకుపోవడంతో గుంత మళ్లీ ఏర్పడింది. జాతీయ రహదారి కావడంతో సాఫీగా ఉండాల్సిన రోడ్డుపై గుంతలు పడినా సంబంధిత అధికారులు అవసరమైన మరమ్మతులు చేపట్టకపోవడం గమనార్హం. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

కళాశాల లెక్చరర్ల బృందం


పెద్దశంకరంపేటలో లెక్చరర్ల బృందం

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కళాశాల లెక్చరర్ల బృందం పేర్కొంది. శుక్రవారం పెద్దశంకరంపేట మండలంలోని ఆయా గ్రామాలలో ఎస్సెస్సీ పూర్తి చేసిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలపై వివరించారు. అన్ని తరగతులకు లెక్చరర్లు అందుబాటులో ఉన్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు వివరించారు. కార్యక్రమంలో లెక్చరర్లు అనంతరాజశర్మ, రాజు, శ్రీశైలం, ప్రభాకర్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాగి నడిపితే తాట తీస్తా

ఎస్‌ఐ శంకర్ హెచ్చరిక

అల్లాదుర్గం(మెదక్): మద్యం తాగి వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎస్‌ఐ శంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగడంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు వీధిన పడుతున్నట్లు చెప్పారు. తాగి రహదారులపై ఇష్టం వచ్చినట్లు వాహనాలు నడుపుతున్నారని, రాంగ్‌రూట్‌లో ప్రయాణం చేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సరస్వతీ నమోస్తుతే..

చదవుల తల్లి సాక్షిగా.. అక్షర శ్రీకారం

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులచే అక్షరభ్యాసం చేయించారు. ముందుగా సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. చాలా చోట్ల సామూహిక అక్షరాభ్యాసం జరిగింది. ఈ కార్యక్రమాల్లో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శివ్వంపేట మండలం తిమ్మాపూర్‌లో అక్షరభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ బుచ్చనాయక్


చిలప్‌చెడ్ మండలం జగ్గంపేటలో..


పాపన్నపేట మండలం చీకోడు లింగాయపల్లిలో..


కొల్చారం సంగాయిపేటలో..


చిన్నశంకరంపేట ప్రాథమిక పాఠశాలలో..


చేగుంట మండలం వడియారంలో..


రామాయంపేట మండలం ప్రగతి ధర్మారంలో..


నర్సాపూర్ మండలం అచ్చంపేటలో ..


కౌడిపల్లి మండలం రాజిపేటలో పిల్లలకు అక్షరాభ్యాసం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని జగ్గంపేట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా చదువుల తల్లి సరస్వతి దేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేఖర్, పంచాయతీ కార్యదర్శి అశోక్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ సంధ్య, అంగన్‌వాడీ టీచర్ షహెనాజ్ బేగం, మాజీ సర్పంచ్ పోచయ్య పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని తిమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఒకటవ తరగతిలో 16 మంది చిన్నారులు ప్రవేశాలు పొందడంతో ఎంఈఓ బుచ్చనాయక్ అక్షరాభ్యాసం చేయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు.

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని చీకోడు లింగాయపల్లి ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నూతనంగా చేరిన పిల్లలచే అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సంగాయిపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లితండాలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఎంఈఓ పుష్పవేణి పాల్గొన్నారు. చిన్నశంకరంపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం దీప్లారాథోడ్ అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా ఒకటో తరగతి విద్యార్థులకు పలకలు, స్కూల్‌బ్యాగులను అందించారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం, కర్నాల్‌పల్లి ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. వడియారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సిద్దిరాములు, కర్నాల్‌పల్లిలో ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు ప్రియదర్శిని, వసంత, సంతోషిమాత, బాలచందర్, సంపత్, అంగన్‌వాడీ టీచర్లు రమ, రాణి, స్రవంతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం, గ్రామ హరిజన వాడలోని ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. మొదటి తరగతి విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగతింది. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందజేశారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాగేందర్, సిద్ధరాంలు పాల్గొన్నారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిని సీడీపీఓ హేమభార్గవి, ఎంఈఓ తారాసింగ్, హెచ్‌ఎం లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కౌడిపల్లి, రాజిపేట, మనంతయపల్లితండాల పాఠశాలలో శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యా సం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలలో ప్రవేశం పొందిన వారికి స్వాగతం పలికారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264